గోదావరి ఉగ్రరూపం.. ఇంకా ముంపులోనే లంక గ్రామాలు 2


Neti Velugu

# నేటి వెలుగు

నేటి సమాజం... నేటి వెలుగు...

RNI NO. TELTEL/2023/88559

తెలుగు దినపత్రిక

www.epaper.netivelugu.com

netivelugu63@gmail.com



నేటి వెలుగు
తెలుగు దినపత్రిక
రిపోర్టర్లు కావలెను
తెలంగాణ ఆంధ్ర ప్రదేశ్
రెండు తెలుగు రాష్ట్రాలలో నేటి వెలుగు తెలుగు దినపత్రికలో పని చేయుటకు
జిల్లా బ్యూరో
జిల్లా స్టాఫ్
డివిజన్ అసెంబ్లీ ఇంచార్జిలు
మండల రిపోర్టర్లు
జూనియర్లకు సీనియర్లకు ప్రాధాన్యత ఇవ్వబడును.
సంప్రదించవలసిన ఫోన్ నెంబరు
95532 76552
ఎడిటర్
నవీన్ కుమార్ గౌడ్



నల్గొండ | సంపుటి : 3 | సంచిక : 109 | పేజీలు : 4 | ఆగస్టు 3 సోమవారం 2026 | వెల రూ. 4.00/-

NALGONDA | VOL:3 | ISSUE: 109 | PAGES:4 | MONDAY AUGUST 3 2026 | Rs. 4:00


## లష్కర్ బోనాల్లో

# సీఎం రేవంత్ రెడ్డి..

## మహంకాళి అమ్మవారికి పట్టువస్త్రాలు




- సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న సీఎం రేవంత్
- ప్రభుత్వం తరపున జగన్మాతకు పట్టువస్త్రాలు, బోనం సమర్పణ
- ముఖ్యమంత్రితో పాటు పాల్గొన్న మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, సీతక్క
- అంగరంగ వైభవంగా జరుగుతున్న లష్కర్ బోనాల జాతర

సికింద్రాబాద్‌లోని శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల జాతర అంగరంగ వైభవంగా, భక్తిశ్రద్ధలతో కొనసాగుతోంది. ఈ ఉత్సవాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని, అమ్మవారిని దర్శించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరపున ఆయన జగన్మాతకు బోనం, పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. లష్కర్ బోనాల జాతరలో భాగంగా ఆలయానికి విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన గర్భగుడిలో మహంకాళి అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. తెలంగాణ ప్రజలు సుఖసంతోషాలతో, పాడిపంటలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, సీతక్క, కాంగ్రెస్ ఎమ్మెల్యే దానం నాగేందర్, బీఆర్ఎస్ శాసనసభ్యుడు

## వికసిత భారత్ కోసం డ్రగ్స్‌కు దూరం.. యువతకు ప్రధాని మోదీ పిలుపు

- వికసిత భారత్ సంకల్ప అభియాన్‌లో భాగంగా 'నశా ముక్త్ యువ' ప్రారంభం
- మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలంటూ యువతకు ప్రధాని మోదీ పిలుపు
- 2047 నాటికి వికసిత భారత్ సాధనకు ఆరోగ్యవంతమైన యువత అవసరమని స్పష్టీకరణ
- దేశవ్యాప్తంగా ప్రతి ఆదివారం క్రీడలు, అవగాహన కార్యక్రమాల నిర్వహణ
- గతేడాది కాశీలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమైనట్లు వెల్లడించిన ప్రధాని

దేశ యువత మాదకద్రవ్యాల (డ్రగ్స్) మహమ్మారికి దూరంగా, శారీరకంగా, (మిగతా 2వ పేజీలో..)



## రాజకీయాల్లోకి 'కాక్రోచ్ జనతా పార్టీ' ఆగస్టు 5న కీలక నిర్ణయం

- రాజకీయ ప్రవేశంపై నిర్ణయం తీసుకోనున్న కాక్రోచ్ జనతా పార్టీ
- ఆగస్టు 5న అభిజీత్ దీప్కే నివాసంలో కీలక కోర్ కమిటీ సమావేశం
- నీట్ పేపర్ లీక్ నిరసనల విజయంతో ఉద్యమ సంస్థపై పెరిగిన అంచనాలు
- ఉద్యమంగానే కొనసాగాలా లేక పార్టీ పెట్టాలా అనే దానిపై స్పష్టత




సమావేశం తర్వాత మీడియాకు వివరాలు వెల్లడించనున్న అభిజీత్ దీప్కే

## బోనాలను గతంలో పట్టించుకోలేదు.. కేసీఆర్ వల్లే బోనాలకు రాష్ట్ర పండుగ హోదా: కేటీఆర్

- సికింద్రాబాద్ మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న కేటీఆర్
- గత ప్రభుత్వాలు బోనాలను గుర్తించలేదని విమర్శ
- కేసీఆర్ పాలనలోనే బోనాలకు రాష్ట్ర పండుగ హోదా వచ్చిందన్న మాజీ మంత్రి
- వర్షాలు బాగా పడి రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ప్రార్థించినట్లు వెల్లడి

నేడు సికింద్రాబాద్‌లోని ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ సందర్భంగా అమ్మవారిని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ దర్శించుకున్నారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసి మొక్కులు (మిగతా 2వ పేజీలో..)



## లష్కర్ బోనాలు ప్రారంభం.. మహంకాళి ఆలయానికి పోటెత్తిన భక్తులు.. పలు మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

- సికింద్రాబాద్‌లో అంగరంగ వైభవంగా ప్రారంభమైన లష్కర్ బోనాలు
- ఉజ్జయిని మహంకాళి ఆలయానికి తెల్లవారుజాము నుంచే పోటెత్తిన భక్తులు
- ప్రభుత్వం తరపున తొలి బోనం, పట్టువస్త్రాలు సమర్పించిన మంత్రి పొన్నం
- భక్తుల కోసం విస్తృత ఏర్పాట్లు.. 1500 మందితో భారీ బందోబస్త్
- బోనాల జాతర సందర్భంగా 4వ తేదీ వరకు ట్రాఫిక్ ఆంక్షలు అమలు

సికింద్రాబాద్‌లో ప్రసిద్ధి చెందిన లష్కర్ బోనాల జాతర అంగరంగ వైభవంగా ప్రారంభమైంది. ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి బోనం సమర్పించేందుకు ఇవాళ తెల్లవారుజాము నుంచే భక్తులు భారీ సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు. అమ్మవారి (మిగతా 2వ పేజీలో..)



నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్
ఎడిటర్ & పబ్లిషర్

## లష్కర్ బోనాల్లో సీఎం రేవంత్ రెడ్డి.. మహంకాళి అమ్మవారికి పట్టువస్త్రాలు

(మొదటి పేజీ తరువాయి)

తలసాని శ్రీనివాస్ యాదవ్ కూడా పాల్గొన్నారు. వారు కూడా అమ్మవారికి పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వీరితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా ఈ వేడుకల్లో పాలుపంచుకున్నారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఆలయ పరిసరాల్లో పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

## బోనాలను గతంలో పట్టించుకోలేదు.. కేసీఆర్ వల్లే బోనాలకు రాష్ట్ర పండుగ హోదా: కేటీఆర్

(మొదటి పేజీ తరువాయి)

చెల్లించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు అర్చకులు, అధికారులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. దర్శనానంతరం మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, కేటీఆర్‌ను శాలువాతో సత్కరించి, జ్ఞాపికను అందజేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, బోనాలు కులాలకు అతీతంగా జరుపుకునే గొప్ప పండుగ అని కొనియాడారు. సమైక్య రాష్ట్రంలో బోనాల పండుగను గత ప్రభుత్వాలు పట్టించుకోలేదని, రాష్ట్ర పండుగగా గుర్తించలేదని విమర్శించారు. తెలంగాణ ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రిగా కేసీఆర్ బోనాలను రాష్ట్ర పండుగగా ప్రకటించారని గుర్తుచేశారు. అమ్మవారి ఆశీస్సులతోనే తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నామని కేసీఆర్ ఎప్పుడూ చెబుతుంటారని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రతి గుడికి రూ. 25 కోట్లు కేటాయించి, పండుగలను ఘనంగా నిర్వహించామని తెలిపారు. రాష్ట్రంలో వర్షాలు సమృద్ధిగా కురిసి, పాడిపంటలతో పచ్చగా ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు కేటీఆర్ చెప్పారు. రైతులందరూ సుఖసంతోషాలతో ఉండాలని మనస్ఫూర్తిగా కోరుకున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## రాజకీయాల్లోకి 'కాక్రోచ్ జనతా పార్టీ' ఆగస్టు 5న కీలక నిర్ణయం

(మొదటి పేజీ తరువాయి)

ఆన్‌లైన్ వేదికగా యువతను సమీకరించి దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన 'కాక్రోచ్ జనతా పార్టీ' (సీజేపీ) ఇప్పుడు కీలక నిర్ణయం దిశగా అడుగులు వేస్తోంది. రాజకీయాల్లోకి ప్రవేశించాలా, లేక ఉద్యమ సంస్థగానే కొనసాగాలా అనే అంశంపై ఆగస్టు 5న తుది నిర్ణయం తీసుకోనుంది. ఈ మేరకు పార్టీ వ్యవస్థాపకుడు, జెన్-జీ ఐకాన్‌గా గుర్తింపు పొందిన అభిజీత్ దీప్కే తన నివాసంలో కోర్ కమిటీ సభ్యులతో సమావేశం కానున్నారని విశ్వసనీయ వర్గాలు ఆదివారం తెలిపాయి. వివిధ రాష్ట్రాల్లోని మద్దతుదారుల నుంచి సేకరించిన అభిప్రాయాల ఆధారంగా భవిష్యత్ కార్యాచరణను ఖరారు చేయనున్నారు. సమావేశం ముగిసిన తర్వాత అభిజీత్ దీప్కే మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తారని పార్టీకి చెందిన ఒక ప్రతినిధి తెలిపారు. నీట్ పేపర్ లీక్ వ్యవహారంపై ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద సీజేపీ నిర్వహించిన నిరసన విజయవంతం కావడం, దాని ఫలితంగా అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయడంతో ఈ ఉద్యమ సంస్థపై అంచనాలు భారీగా పెరిగాయి. అయితే, విద్యార్థులు, యువత సమస్యలపై స్పందించే 'రెస్పాన్స్ గ్రూప్'గానే సీజేపీని కొనసాగిస్తామని అభిజీత్ గతంలోనే స్పష్టం చేశారు. శాంతియుత, ప్రజాస్వామ్య పద్ధతులకే కట్టుబడి ఉంటామని, ఏ రాజకీయ పార్టీకి అనుబంధంగా మారబోమని, ఏ పార్టీలోనూ విలీనం కాబోమని ఆయన పునరుద్ఘాటించారు. ఈ నేపథ్యంలో ఆగస్టు 5న జరిగే సమావేశం ప్రాధాన్యత సంతరించుకుంది. విద్యార్థుల సమస్యలపై ఉద్యమాలను నిలబెట్టుకోవడం, విద్యా రంగంలో మార్పులకు చోదకశక్తిగా కొనసాగడం సీజేపీ ముందున్న అసలైన సవాలు అని విశ్లేషకులు భావిస్తున్నారు. సీజేపీ ఉద్యమం వెనుక బాహ్య శక్తుల పాత్ర ఉందన్న ఆరోపణలు వినిపిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అసంతృప్తి లేనిచోట ఇలాంటి ఉద్యమాలు పుట్టవని, కేవలం ఉన్న సమస్యలను విస్తృతం చేయగలవని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సీజేపీ వేగంగా విస్తరించిన తీరు, సోషల్ మీడియాలో వారి ప్రచారం, యువత పెద్ద సంఖ్యలో పాల్గొనడం వంటివి... గత రెండు దశాబ్దాలుగా ప్రపంచవ్యాప్తంగా కనిపిస్తున్న నిరసన ఉద్యమాల నమూనాను ప్రతిబింబిస్తున్నాయని పరిశీలకులు పేర్కొంటున్నారు.

## హైడ్రాకు వెల్లువెత్తిన ప్రజా మద్దతు.. కొనసాగించాలంటూ హైదరాబాదులో ర్యాలీలు

హైదరాబాద్ నగరంలో వరద నివారణ, చెరువుల పరిరక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన 'హైడ్రా'కు ప్రజా మద్దతు వెల్లువెత్తింది. ప్రభుత్వ నిర్ణయానికి మద్దతుగా, హైడ్రా పనితీరును ప్రశంసిస్తూ నగరంలోని పలు కాలనీల సంక్షేమ సంఘాలు ఆదివారం భారీ ర్యాలీలు నిర్వహించాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి అనుకూలంగా నినాదాలు చేస్తూ, హైడ్రా కమిషనర్‌కు సంఘీభావం ప్రకటించాయి. అమీర్‌పేట, మధురానగర్, శ్రీనివాసనగర్ పరిసర ప్రాంతాల్లో శ్రీనివాస నగర్ వెస్ట్, వెంగల్ రావు నగర్, మధుర నగర్ సహా పదుల సంఖ్యలో కాలనీ సంక్షేమ సంఘాలు ఈ ర్యాలీలలో పాల్గొన్నాయి. హైడ్రాపై సోషల్ మీడియాలో జరుగుతున్న దుష్ప్రచారాన్ని ఖండిస్తూ, ప్రభుత్వానికి తమ మద్దతును వీడియోల రూపంలో పంపించాయి. గత రెండేళ్లలో హైడ్రా సాధించిన విజయాలే ఈ మద్దతుకు కారణమని సంఘాల ప్రతినిధులు తెలిపారు. సుమారు 3325 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జాదారుల నుంచి కాపాడటంతో పాటు, రూ. 1.50 లక్షల కోట్ల విలువైన ఆస్తులను పరిరక్షించిందని వారు ప్రశంసించారు. రెండు విడతల్లో 20 చెరువులను పునరుద్ధరించి ఆయా ప్రాంతాల్లో వరద ముప్పును శాశ్వతంగా తొలగించడాన్ని నగర ప్రజలు కళ్లారా చూస్తున్నారని పేర్కొన్నారు. ఒకప్పుడు 5 సెంటీమీటర్ల వర్షానికే అమీర్‌పేట, పరిసర ప్రాంతాలు నీట మునిగేవని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చొరవతో హైడ్రా రంగంలోకి దిగిందని స్థానికులు గుర్తుచేశారు. జీహెచ్ఎంసీ, జలమండలి, ఇరిగేషన్ శాఖలతో సమన్వయం చేసుకుంటూ వారం రోజుల్లోనే వరద సమస్యను పరిష్కరించిందని కొనియాడారు. కొంతమంది కబ్జాదారులు, వారికి సహకరించే నాయకులు తమ ఆటలు సాగకపోవడంతోనే సోషల్ మీడియాలో హైడ్రాపై బురద చల్లుతున్నారని వారు ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకున్న ఈ నిర్ణయానికి సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని, ఎట్టి పరిస్థితుల్లోనూ హైడ్రాను కొనసాగించాలని వారు డిమాండ్ చేశారు. కమిషనర్ ఏవీ రంగనాథ్ నేతృత్వంలోనే ఈ కార్యక్రమాలు కొనసాగాలని నినాదాలు చేశారు. ఇటీవల, హైడ్రా కమిషనర్ గా ఏవీ రంగనాథ్ ను తొలగించాలంటూ తెలంగాణ హైకోర్టు సంచలన ఆదేశాలు ఇచ్చిన నేపథ్యంలో, నేటి ప్రజా ర్యాలీలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# లష్కర్ బోనాలు ప్రారంభం.. మహంకాళి ఆలయానికి పోటెత్తిన భక్తులు.. పలు మార్గాల్లో ట్రాఫిక్ ఆంక్షలు

(మొదటి పేజీ తరువాయి)

దర్శనం కోసం వచ్చిన భక్తులతో ఆలయ పరిసరాలు కిక్కిరిసిపోయాయి. జై మహంకాళి నినాదాలతో సికింద్రాబాద్ వీధులు మార్మోగాయి. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం తరఫున దేవాదాయ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ దంపతులు అమ్మవారికి తొలి బోనం, పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అధికారులు పటిష్ఠమైన ఏర్పాట్లు చేశారు. ఎలాంటి ఇబ్బందులు కలగకుండా సాధారణ భక్తుల కోసం మూడు, బోనాలు సమర్పించే మహిళల కోసం రెండు ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేశారు. వీఐపీల కోసం మరో క్యూలైన్ సిద్ధం చేశారు. వాహనాల పార్కింగ్ కోసం ప్రత్యేక కేంద్రాలను కేటాయించగా, సుమారు 1500 మంది పోలీసు సిబ్బందితో భారీ బందోబస్త్ నిర్వహిస్తున్నారు. జాతరలో భాగంగా ఆదివారం అమ్మవారికి భక్తులు బోనాలు సమర్పిస్తుండగా, సోమవారం ఉదయం భవిష్యవాణి వినిపించే రంగం కార్యక్రమం జరగనుంది. ఆ తర్వాత ఏనుగు అంబారీపై అమ్మవారి ఘటాల ఊరేగింపుతో ఉత్సవాలు ముగుస్తాయి.

**పలు ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు**

లష్కర్ బోనాల జాతర నేపథ్యంలో సికింద్రాబాద్ పరిసర ప్రాంతాల్లో పోలీసులు ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. ఈ నెల 4వ తేదీ ఉదయం వరకు ఆలయం చుట్టూ రెండు కిలోమీటర్ల పరిధిలో ట్రాఫిక్ మళ్లింపులు అమలులో ఉంటాయని ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ జోయల్ డేవిస్ తెలిపారు. జాతర ముగిసే వరకు పొగాకుబజార్, సుభాష్ రోడ్, జనరల్ బజార్ నుంచి మహంకాళి ఆలయానికి వెళ్లే దారులను మూసివేస్తున్నట్లు ఆయన ప్రకటించారు. కర్బాలా క్రాస్‌రోడ్స్ వద్ద వాహనాలను రాణిగంజ్ వైపు మళ్లిస్తున్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు వెళ్లే ఆర్టీసీ బస్సులు, ఇతర వాహనాలు రాణిగంజ్ క్రాస్‌రోడ్స్ నుంచి మినిస్టర్ రోడ్డు, గోపాలపురం లైన్ మీదుగా ప్రయాణించాలని అధికారులు సూచించారు.

# వికసిత భారత్ కోసం డ్రగ్స్‌కు దూరం.. యువతకు ప్రధాని మోదీ పిలుపు

(మొదటి పేజీ తరువాయి)

మానసికంగా సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నప్పుడే 'వికసిత భారత్' సంకల్పం నెరవేరుతుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో నేటి తరం యువత చూపిస్తున్న నిబద్ధత, సామాజిక స్పృహ తన నమ్మకాన్ని మరింత బలపరిచాయని ఆయన ప్రశంసించారు. నేడు 'నశా ముక్త్ యువ ఫర్ వికసిత భారత్ సంకల్ప్ అభియాన్' కార్యక్రమాన్ని ప్రధాని వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ప్రారంభించి ప్రసంగించారు. దేశవ్యాప్తంగా యువతను ఏకతాటిపైకి తెచ్చి, మాదకద్రవ్యాల వ్యతిరేక ఉద్యమంలో భాగస్వాములను చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. 'మై భారత్' వాలంటీర్ల నేతృత్వంలో ఇది ఒక ప్రజా భాగస్వామ్య (జన్ భాగీదారీ) ఉద్యమంగా రూపుదిద్దుకుంది. "మనం ఒక గొప్ప, ముఖ్యమైన సంకల్పం కోసం ఇక్కడ సమావేశమయ్యాం. ఈ కార్యక్రమం కేవలం ఒక వ్యక్తి, కుటుంబం లేదా సమాజం కోసం కాదు. ఇది దేశం కోసం. వికసిత భారత్ దిశగా దేశం అడుగులు వేస్తున్నప్పుడు, యువత డ్రగ్స్ సమస్యకు దూరంగా ఉండటం అత్యవసరం" అని ప్రధాని మోదీ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా కాశీతో ఈ కార్యక్రమానికి ఉన్న అనుబంధాన్ని ప్రధాని గుర్తుచేసుకున్నారు. "కాశీ ఎంపీగా, ఈ కార్యక్రమం గతేడాది పవిత్ర కాశీ క్షేత్రంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభం కావడం నాకు చాలా సంతోషాన్నిచ్చింది. దీనివల్ల ఈ కార్యక్రమానికి శాస్త్రీయ దృక్పథంతో పాటు ఆధ్యాత్మిక శక్తి, సాధువుల ఆశీస్సులు, సాంస్కృతిక వారసత్వం కూడా తోడయ్యాయి" అని ఆయన అన్నారు. 2025 జులైలో వారణాసిలో జరిగిన యూత్ స్పిరిచ్యువల్ సమ్మిట్‌లో దేశంలోని 125 ఆధ్యాత్మిక సంస్థలు ఐదేళ్ల రోడ్‌మ్యాప్‌తో 'కాశీ డిక్లరేషన్'ను ఆమోదించాయని, వారంతా లక్షలాది పౌరులకు సేవ చేస్తున్నారని మోదీ వివరించారు. యువతను దేశానికి 'అమృత తరం' (అమృత్ పీఢీ)గా అభివర్ణించిన ప్రధాని.. "రాబోయే 20-25 ఏళ్లలో మీ జీవితాలకు మీరే దిశానిర్దేశం చేసుకుంటారు. 2047 నాటికి వికసిత భారత్ సంకల్పాన్ని సాకారం చేసేది మీరే. ఆ విజయాన్ని సంపూర్ణంగా ఆస్వాదించేది కూడా మీరే. దేశానికి మీ శక్తి, సృజనాత్మకత, ప్రతిభ ఎంతో అవసరం. కాబట్టి దేశం కోసం, మీ సొంత జీవితాల కోసం డ్రగ్స్‌కు దూరంగా ఉండండి" అని పిలుపునిచ్చారు. ఈ ప్రచారంలో భాగంగా ప్రతి ఆదివారం దేశవ్యాప్తంగా క్రీడా కార్యక్రమాలు, వాకథాన్‌లు, ధ్యాన శిబిరాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. 'మాదకద్రవ్యాలకు దూరంగా ఉండే యువతే వికసిత భారత్‌కు అసలైన బలం' అనే సందేశాన్ని దేశంలోని ప్రతి యువకుడికి చేర్చడమే ఈ ఉద్యమ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

# గోదావరి ఉగ్రరూపం.. ఇంకా ముంపులోనే లంక గ్రామాలు

**గోదావరికి కొనసాగుతున్న వరద ఉధృతి**

**కోనసీమ, ఉభయ గోదావరి జిల్లాల్లో ముంపులో లంక గ్రామాలు**

**పలు గ్రామాలకు నిలిచిపోయిన బోట్లు, రవాణా సౌకర్యాలు**

**ప్రమాదకరంగా ప్రవహిస్తున్న వశిష్ఠ, గౌతమి పాయలు**

**అప్రమత్తమైన అధికారులు, కొనసాగుతున్న సహాయక చర్యలు**

ఎగువ రాష్ట్రాల్లో కురుస్తున్న భారీ వర్షాలతో గోదావరి నది ఉగ్రరూపం దాల్చింది. వరద పోటెత్తడంతో కోనసీమ, ఉభయ గోదావరి జిల్లాలు వణికిపోతున్నాయి. స్థానికంగా వర్షాలు తగ్గుముఖం పట్టినా, మహారాష్ట్ర, తెలంగాణ, కర్ణాటకల నుంచి భారీగా వస్తున్న వరద నీటితో గోదావరి ప్రమాదకర స్థాయిలో ప్రవహిస్తోంది. దీంతో లంక గ్రామాలు నీట మునిగి, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కోనసీమ జిల్లాలోని అనేక లంక గ్రామాలు బాహ్య ప్రపంచంతో సంబంధాలు కోల్పోయాయి. ముమ్మిడివరం నియోజకవర్గంలోని లంక గ్రామాల పరిస్థితి ఆందోళనకరంగా ఉంది. గోగులంక, గుత్తెనదీవి, కేసనకుర్రు వంటి ప్రాంతాల్లో బోట్ల సర్వీసులను పూర్తిగా నిలిపివేశారు. తానేలంక - గురజాపులంక మధ్య రహదారిపై వరద నీరు ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. అప్పనపల్లి, ముక్తేశ్వరం, కనకాయలంక, అయ్యినవిల్లిలంక, వీరవల్లిపాలెం, అద్దంకివారిలంక వంటి అనేక గ్రామాలకు రాకపోకలు పూర్తిగా స్తంభించాయి. కొబ్బరి రైతులు తమ పంటను కాపాడుకునేందుకు ట్రాక్టర్ల సహాయంతో కాయలను సురక్షిత ప్రాంతాలకు తరలిస్తున్నారు. రాజమండ్రి వద్ద గోదావరి ఉధృతంగా ప్రవహిస్తుండటంతో నదీ తీరం కోతకు గురవుతోంది. అధికారులు ఇసుక బస్తాలు వేసి కోతను అరికట్టే ప్రయత్నాలు చేస్తున్నారు. పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలి మండలం చింతపల్లి వద్ద, గౌతమి పాయ ప్రమాదకరంగా ప్రవహిస్తోంది. మొదటి ప్రమాద హెచ్చరిక కొనసాగుతోంది. అయితే, గత రాత్రితో పోలిస్తే ప్రవాహం స్వల్పంగా తగ్గింది. భారీగా వస్తున్న వరద నీరు సముద్రంలోకి వెళుతోంది. మరోవైపు, ఏలూరు జిల్లా వేలేరుపాడు మండలంలోని వరద ప్రభావిత ప్రాంతాలను ఎమ్మెల్యే బాలరాజు, ఎస్పీ ప్రశాంత్ కిశోర్ పరిశీలించారు. అధికారులు కంట్రోల్ రూంలు ఏర్పాటు చేసి, లంక గ్రామాల ప్రజలను నిరంతరం అప్రమత్తం చేస్తున్నారు. కలెక్టర్ మహేశ్ కుమార్ ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తూ, అధికారులకు తగిన సూచనలు జారీ చేస్తున్నారు. సహాయక చర్యలు ముమ్మరం చేసి, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఆదేశించారు.



# కళాకారులకు పెద్దన్న... పేదలకు భరోసా "ఈగ మల్లేశం"





**సేవా ప్రస్థానానికి ఘన సత్కారం..**

**ఈగ మల్లేశం - సంగీత దంపతులకు 'స్వరాభిషేకం' వేదికపై ఘన సన్మానం**

**కళా,సామాజిక,ప్రజాసేవకు గుర్తింపు**

**ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, ఎస్. జానకి మధురస్మృతులలో నిర్వహించిన కార్యక్రమం**

**హనుమకొండ జిల్లా ఆగస్టు 2 నేటి వెలుగు ప్రతినిధి,:**

కళాకారుల సంక్షేమం, నిరుపేదలకు చేయూత, విద్యార్థులకు విద్యాసహాయం, సామాజిక సేవా కార్యక్రమాలతో ప్రజల మధ్య ప్రత్యేక గుర్తింపు పొందిన శ్రీ ఈగ మల్లేశం ఘన సన్మానం అందుకున్నారు. ఎస్పీ బాలసుబ్రహ్మణ్యం, గానకోకిల ఎస్. జానకి మధురస్మృతులను స్మరించుకుంటూ నిర్వహించిన "స్వరాభిషేకం" మహోత్సవ వేదికగా ఈ సత్కార కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా శ్రీ ఈగ మల్లేశం- సంగీత దంపతులకు గజమాలతో ఘనంగా సన్మానం చేసి సన్మాన పత్రాన్ని అందజేశారు.

సేవను జీవిత ధ్యేయంగా మలచుకుని నాలుగు దశాబ్దాలకు పైగా ప్రజాజీవితంలో కొనసాగుతున్న ఈగ మల్లేశం గారి సేవా ప్రస్థానాన్ని నిర్వాహకులు ఈ సందర్భంగా కొనియాడారు. రాజకీయ, సామాజిక, సాంస్కృతిక రంగాల్లో ఆయన అందించిన సేవలను గుర్తుచేస్తూ ఘనంగా సత్కరించారు.

**కళాకారుల సంక్షేమానికి అండగా..**

ఉభయ తెలుగు రాష్ట్రాల కళాకారుల సంక్షేమ మండలి అధ్యక్షునిగా కళాకారుల సమస్యల పరిష్కారానికి, వారి సంక్షేమానికి కృషి చేస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. మరుగునపడుతున్న జానపద కళారూపాలను, లిపిలేని కళారూపాలను కాపాడటంతో పాటు కళాకారులకు గుర్తింపు, ప్రోత్సాహం అందించేందుకు ఆయన కృషి చేస్తున్నారని పేర్కొన్నారు. నటుడిగా నాటకాలలో నటించడంతో పాటు పలు చలనచిత్రాలకు రచయితగా, గాయకుడిగా కూడా కళారంగంతో తన అనుబంధాన్ని కొనసాగించారని గుర్తుచేశారు. నిరుపేద కుటుంబాలకు చేయూత వేలాది నిరుపేద యువజంటల వివాహాలకు ఆర్థిక సహాయం అందించడం, విద్యార్థులకు విద్యాసహాయం చేయడం, పేదలకు గృహనిర్మాణానికి సహకరించడం, ఆపదలో ఉన్న కుటుంబాలకు అండగా నిలవడం వంటి సేవా కార్యక్రమాలను నిర్వాహకులు ప్రస్తావించారు.నిరుపేద కళాకారులకు ప్రోత్సాహం అందించడంతో పాటు ప్రభుత్వ పింఛన్లు అందేలా కృషి చేసినట్లు తెలిపారు. కరోనా సమయంలోనూ సేవలు కరోనా మహమ్మారి సమయంలో సురభి కళాకారులు, ఇతర కళాకారులు, నిరుపేదలకు ఆహారం, నిత్యావసర వస్తువులు, ఆర్థిక సహాయం అందించి అండగా నిలిచారని పేర్కొన్నారు. ఆపద సమయంలో అనేక కుటుంబాలకు ఆయన సేవలు భరోసా కల్పించాయని తెలిపారు.

**పద్మశాలి సమాజ అభ్యున్నతికి కృషి**

అఖిల భారత పద్మశాలి జాతీయ అధ్యక్షునిగా బాధ్యతలు నిర్వహిస్తూ చేనేత కుటుంబాల సంక్షేమానికి కృషి చేస్తున్నారని నిర్వాహకులు తెలిపారు. వివిధ ప్రాంతాల్లోని చేనేత కుటుంబాల సమస్యలను పరిష్కరించేందుకు, వలసలను తగ్గించేందుకు తనవంతుగా సహకరిస్తున్నారని పేర్కొన్నారు.తెలంగాణ ఉద్యమంలోనూ కీలక పాత్ర తెలంగాణ సాధన ఉద్యమ సమయంలో ప్రజల్లో ఉద్యమస్ఫూర్తిని పెంపొందించడంలో భాగంగా 'దూంధాం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన వారిలో ఈగ మల్లేశం కీలక పాత్ర పోషించారని నిర్వాహకులు తెలిపారు. రాష్ట్ర రాజకీయ పార్టీల యువజన సంఘాల సంయుక్త కార్యాచరణ కమిటీ (జేఏసీ) తొలి కన్వీనర్‌గా కూడా పనిచేశారని గుర్తుచేశారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం నుంచి ఎన్టీఆర్ ఆశయాలను ముందుకు తీసుకెళ్లే క్రమంలో ప్రజాజీవితంలో కొనసాగుతూ, ఆలిండియా అభిమాన సంఘం గౌరవ అధ్యక్షునిగా సేవలందిస్తున్నారని తెలిపారు. పదవిని సేవకు సాధనంగా మార్చుకున్నారంటూ ప్రశంసలు కేంద్ర ఖాదీ, చిన్న పరిశ్రమల సంస్థ డైరెక్టర్‌గా బాధ్యతలు నిర్వహించి గ్రామీణాభివృద్ధి, కుటీర పరిశ్రమలు, స్వయం ఉపాధి రంగాలకు సేవలందించారని పేర్కొన్నారు. స్వాతంత్ర్య సమరయోధుల వారసుల సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా కూడా సేవలందిస్తూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేశారని తెలిపారు."పదవులను అలంకరించడం కాదు.. పదవులకు ప్రజోపయోగ పరిమళాన్ని అద్దడమే ఈగ మల్లేశం సేవా తత్వం" అని నిర్వాహకులు కొనియాడారు.

**"ఒక వ్యక్తిని కాదు.. ఒక సేవా తత్వాన్ని సత్కరిస్తున్నాం"**

ఈగ మల్లేశం పేరు ఒక వ్యక్తి పేరు మాత్రమే కాదని, అది కళాకారులకు భరోసా, నిరుపేదలకు అండ, సమాజానికి సేవా సంప్రదాయానికి ప్రతీకగా నిలిచిందని నిర్వాహకులు పేర్కొన్నారు. "కళాకారులకు అందించిన సహాయం కేవలం ఆర్థిక బలం కాదు.. వారి ఆత్మవిశ్వాసానికి అభయహస్తం. పేదలకు అందించిన చేయూత కేవలం దానం కాదు.. మానవత్వానికి చేసిన మహాయజ్ఞం" అంటూ ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా ఈగ మల్లేశం సేవలను గుర్తిస్తూ "స్వరాభిషేకం" వేదికపై ఘనంగా సత్కరించి సన్మాన పత్రాన్ని అందజేశారు. కళాసేవ రత్న అవార్డు గ్రహీత, కేంద్ర ఖాది,చిన్న పరిశ్రమల పూర్వ డైరెక్టర్ ఈగ మల్లేశం మాట్లాడుతూ ఈ స్వరాభిషేక కార్యక్రమం మొదటగా మద్రాస్ లో దివంగత బాలసుబ్రహ్మణ్యం నిర్వహించినప్పుడు తనను ఎంపిక చేయడం జరిగిందన్నారు.అయితే అంత దూరం వెళ్లి అవార్డు తీసుకునే పరిస్థితిలో నేను లేకపోవడం వల్ల ఓరుగల్లు కళాకారులు ఆ అవార్డును ఎలాగైనా కలలకు పుట్టినిల్లు అయిన వరంగల్లో నిర్వహించి మా కళాకారుని సన్మానించుకుంటామని వారికి మాట ఇచ్చారని అన్నారు.వారి కోరిక మేరకు శనివారం నాకు ఈ సన్మానం చేయడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. తన కుటుంబ కళాకారులకు చెందింది అని, కలల కోసం అహర్నిశలు కృషి చేస్తానని అన్నారు.

# భారతీయ జనతా జెండా ఆవిష్కరణ





**మిర్యాలగూడ పట్టణం ఆగస్టు 2 నేటి వెలుగు ప్రతినిధి**

మిర్యాలగూడ పట్టణంలోని 1 టౌన్ 19వ వార్డు సంతోష్ మాత ఆలయం వద్ద భారతీయ జనతా పార్టీ నూతన జెండా ఆవిష్కరణ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన భారతీయ జనతా పార్టీ నల్గొండ జిల్లా అధ్యక్షులు డా. నాగం వర్షిత్ రెడ్డి పార్టీ జెండాను ఆవిష్కరించారు.ఈ సందర్భంగా డా. నాగం వర్షిత్ రెడ్డి మాట్లాడుతూ, భారతీయ జనతా పార్టీ దేశభక్తి, సేవాభావం, అభివృద్ధి అనే మూడు మూల సూత్రాలతో దేశ ప్రజల విశ్వాసాన్ని సంపాదించుకుందని అన్నారు. ప్రతి కార్యకర్త పార్టీ సిద్ధాంతాలను ప్రజల్లోకి తీసుకెళ్లి, కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఇంటింటికీ చేర్చాలని పిలుపునిచ్చారు. రానున్న రోజుల్లో పార్టీని గ్రామ స్థాయి నుంచి బూత్ స్థాయి వరకు మరింత బలోపేతం చేసి ప్రజలకు మరింత చేరువ చేయాలని సూచించారు.అలాగే, భారతీయ జనతా పార్టీ జెండా దేశభక్తికి, జాతీయవాదానికి, సేవా తత్వానికి ప్రతీక అని పేర్కొంటూ, ప్రతి కార్యకర్త పార్టీ గౌరవాన్ని కాపాడుతూ ప్రజా సేవలో ముందుండాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శ్రీ సాదినేని శ్రీనివాస్ , 1 టౌన్ ఇంచార్జ్ బంటు గిరి , వైస్ ప్రెసిడెంట్ చిలుకూరు వెంకటేశ్వర్లు , సీనియర్ నాయకులు బంటు సైదులు, శ్యామ్ , వెలుగు నాగరాజు , పురుషోత్తం , రమణ , రాజీ రెడ్డి , ఎడ్ల రమేష్ , 2 టౌన్ అధ్యక్షులు పెద్దవైన వీటి , బీజేవైఎం నాయకులు అభి గారు, పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# డీ8 కాలువకు జలకళ.. రైతుల్లో కొత్త ఆశలు

- ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు చొరవ... మూడు గ్రామాలకు సాగునీటి బాట..!
- మూడు గ్రామాల చెరువులకు నీరందించేలా కాలువ పనులు
- రైతు ప్రయోజనాలే లక్ష్యం..
- సర్పంచుల మండల ఫోరం అధ్యక్షులు పోలేపల్లి శివశంకర్ రెడ్డి



**ఐనవోలు, ఆగస్టు 2 నేటి వెలుగు ప్రతినిధి:**

రైతు ప్రయోజనాలే కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వ లక్ష్యమని,ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు చొరవతో మూడు గ్రామాలకు సాగునీటి బాట పడుతుందని, దీంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారని సర్పంచుల మండల ఫోరం అధ్యక్షులు పోలేపల్లి శివశంకర్ రెడ్డి అన్నారు.వర్ధన్నపేట నియోజకవర్గ ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు ఆదేశాల మేరకు ఐనవోలు మండలంలోని ముల్కలగూడెం, నర్సింహులగూడెం, కొండపర్తి గ్రామాలకు డీ8 కెనాల్ ద్వారా నీటిని సరఫరా చేసేందుకు కాలువ పనులు చేపట్టారు.మూడు గ్రామాలకు నీరు చేరేలా జేసీబీ సహాయంతో కాలువను తీయించే పనులను మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు పోలేపల్లి శివశంకర్ రెడ్డి, ముల్కలగూడెం సర్పంచ్ రాధిక లింగరాజు పర్యవేక్షించారు.ఈ కాలువ ద్వారా మెల్లకుంట, తుర్కలకుంట, తాళ్లకుంట, కొండపర్తి ఊరచెరువులకు నీరు చేరే అవకాశం ఉంది. చెరువులకు నీరు అందితే రైతులకు వ్యవసాయానికి ఎంతో దోహదపడుతుందని రైతులు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నీటి సరఫరాకు చర్యలు తీసుకున్న ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు కు రైతులు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో భాస్కర్ రెడ్డి, కట్కూరి బాబు, యాకుబ్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డితో పాటు నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## ఆగస్టు నెలాఖరు నాటికి ట్రేడ్ లైసెన్స్ లేకుండా ఒక్క వ్యాపార సంస్థ కూడా కొనసాగరాదు కమిషనర్ శ్రీ బి. వంశీకృష్ణ



**నల్గొండ పట్టణం ఆగస్టు 2 నేటి వెలుగు ప్రతినిధి '**

నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ట్రేడ్ లైసెన్స్ ఆదాయాన్ని పెంచడంతో పాటు చెల్లుబాటు అయ్యే లైసెన్స్ లేకుండా ఏ వ్యాపార సంస్థ కూడా కొనసాగకుండా చర్యలు చేపట్టాలనిలి కమిషనర్ శ్రీ బి. వంశీకృష్ణ అధికారులను ఆదేశించారు.నగరంలోని అన్ని వ్యాపార సంస్థలపై షాప్ టు షాప్ సర్వే నిర్వహించి, ట్రేడ్ లైసెన్స్ లేని సంస్థలను గుర్తించి వెంటనే లైసెన్స్ పొందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. నిబంధనలను పాటించని సంస్థలపై లితెలంగాణ మున్సిపాలిటీల చట్టం--2019 ప్రకారం నోటీసులు జారీ చేసి, అవసరమైతే సీజ్ చేయడం లేదా మూసివేయడం వంటి చట్టపరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు.ఆగస్టు నెలాఖరు నాటికి నల్లగొండ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ట్రేడ్ లైసెన్స్ లేకుండా ఏ వ్యాపార సంస్థ కూడా కొనసాగకూడదని స్పష్టం చేసిన కమిషనర్, ఈ కార్యక్రమంలో నిర్లక్ష్యం ప్రదర్శించిన సంబంధిత వార్డు అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే, ప్రతి వార్డు అధికారి తన పరిధిలో లిట్రేడ్ లైసెన్స్ వసూళ్లు, ఆస్తి పన్ను వసూళ్లు, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, అక్రమ నిర్మాణాల నియంత్రణ మరియు ప్రజా సమస్యల పరిష్కారంలి వంటి అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ప్రజల నుంచి అందుతున్న ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించి, ప్రతి వార్డులో సమర్థవంతమైన సేవలు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మున్సిపల్ కార్పొరేషన్ ఆదాయం పెంపు లక్ష్యంగా రెవెన్యూ వసూళ్లు మరియు ట్రేడ్ లైసెన్సుల జారీ ప్రక్రియను వేగవంతం చేసి, నిర్ణీత లక్ష్యాలను గడువులోగా పూర్తి చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలనిలి కమిషనర్ సూచించారు.

# టీమిండియాకు ఎదురుదెబ్బ.. శ్రీలంకతో టెస్టు సిరీస్‌కు బుమ్రా కష్టమే!

భారత క్రికెట్ జట్టుకు గట్టి ఎదురుదెబ్బ తగిలింది. జట్టు ప్రధాన పేస్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా, శ్రీలంకతో జరగనున్న రెండు మ్యాచ్‌ల టెస్టు సిరీస్‌కు దూరమయ్యే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఎడమ మోకాలిలో అసౌకర్యంతో బాధపడుతున్న అతనికి పూర్తిస్థాయిలో కోలుకోవడానికి మరింత సమయం అవసరమని బీసీసీఐ వైద్య బృందం భావిస్తోంది. దీంతో ఆగస్టు 15 నుంచి ప్రారంభం కానున్న ఈ కీలక సిరీస్‌కు బుమ్రా సేవలు కోల్పోవడం దాదాపు ఖాయమైంది.వివరాల్లోకి వెళ్తే, గత నెల ఇంగ్లండ్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో బుమ్రా గాయపడ్డాడు. జులై 19న కార్డిఫ్‌లో జరిగిన రెండో వన్డేలో ఫీల్డింగ్ చేస్తుండగా అతని ఎడమ మోకాలికి దెబ్బ తగలడంతో వాపు వచ్చింది. అప్పటి నుంచి అతను బౌలింగ్‌కు దూరంగా ఉన్నాడు. ప్రస్తుతం బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (జశీజు)లో ఉన్న బుమ్రా, ఇంకా బౌలింగ్ ప్రాక్టీస్ ప్రారంభించలేదని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. "ఇప్పుడే అతడిని ఆడిస్తే గాయం తీవ్రతరం అయ్యే ప్రమాదం ఉంది. అందుకే, బుమ్రా పూర్తిగా కోలుకోవడానికే ప్రాధాన్యత ఇస్తున్నాం. ఈ నేపథ్యంలో శ్రీలంక పర్యటనకు అతను దూరంగా ఉండొచ్చు" అని ఓ అధికారి ఐఏఎన్ఎస్‌కు తెలిపారు.వాస్తవానికి, శుభ్‌మన్ గిల్ నేతృత్వంలోని టెస్టు జట్టుకు బుమ్రాను ఎంపిక చేసినప్పటికీ, ఫిట్‌నెస్ నిరూపించుకుంటేనే తుది జట్టులో ఉంటాడని సెలక్టర్లు స్పష్టం చేశారు. ఇప్పుడు అతను దూరం కానుండటంతో, అజిత్ అగార్కర్ నేతృత్వంలోని సెలక్షన్ కమిటీ అతని స్థానంలో ప్రత్యామ్నాయ ఆటగాడిని ప్రకటించనుంది. జమ్మూ కశ్మీర్ సీమ్ బౌలింగ్ ఆల్ రౌండర్ అకిబ్ నబీ ఈ రేసులో ముందున్నాడు. ఇటీవల రంజీ ట్రోఫీలో 60 వికెట్లతో సత్తాచాటిన నబీ, ఇండియా-ఏ తరఫున శ్రీలంక పర్యటనలోనూ రాణించాడు.బుమ్రా గైర్హాజరీతో భారత పేస్ బౌలింగ్ విభాగంలో మహమ్మద్ సిరాజ్, ప్రసిద్ధ్ కృష్ణ, గుర్నూర్ బ్రార్ మాత్రమే మిగిలారు. భారత జట్టు ఆగస్టు 4న శ్రీలంకకు బయలుదేరి వెళ్లనుంది. అక్కడ ఆగస్టు 7 నుంచి 9 వరకు కొలంబోలో ప్రాక్టీస్ మ్యాచ్ ఆడుతుంది. అనంతరం గాలే వేదికగా ఆగస్టు 15న తొలి టెస్టు, కొలంబోలో ఆగస్టు 23 నుంచి రెండో టెస్టు జరుగుతాయి.

నేటి వెలుగు
నేటి సమాజం... నేటి వెలుగు...
తెలుగు దినపత్రిక
పి. నవీన్ కుమార్ గౌడ్

# దేవి శ్రీ హీరోగా 'ఎల్లమ్మ'.. కిర్రాక్ పుట్టించే ఫస్ట్ లుక్ వచ్చేసింది!




ప్రముఖ సంగీత దర్శకుడు, రాక్‌స్టార్ దేవి శ్రీ ప్రసాద్ పుట్టినరోజు సందర్భంగా ఆయన అభిమానులకు అదిరిపోయే సర్‌ప్రైజ్ అందింది. ఆయన కథానాయకుడిగా వెండితెరకు పరిచయం అవుతున్న 'ఎల్లమ్మ' చిత్రం నుంచి ఫస్ట్ లుక్ పోస్టర్‌ను చిత్రబృందం విడుదల చేసింది. ఈ చిత్రంలో దేవి శ్రీ ప్రసాద్ 'పర్షి' అనే శక్తివంతమైన పాత్రలో నటిస్తున్నారు. ఈ లుక్ విడుదలైన కొద్దిసేపటికే సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. విడుదలైన పోస్టర్‌లో దేవి శ్రీ ప్రసాద్ రెట్రో రగ్డ్ లుక్‌లో, పల్లెటూరి యువకుడిగా ఎంతో సహజంగా కనిపిస్తున్నారు. ఆయన పాత్ర పేరు 'పర్షి' అని ప్రకటిస్తూ, "మీరు గుర్తుంచుకునే పేరు, మీరు ఎప్పటికీ మరచిపోలేని ప్రయాణం" అనే క్యాప్షన్‌ను జోడించారు. దీన్నిబట్టి ఈ సినిమా మట్టితో ముడిపడిన ఒక బలమైన కథతో రాబోతోందని అర్థమవుతోంది. 'బలగం' వంటి జాతీయ అవార్డు పొందిన చిత్రంతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన వేణు యెల్దండి ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తుండటంతో అంచనాలు తారాస్థాయికి చేరాయి. టాలీవుడ్‌లో అగ్ర నిర్మాణ సంస్థగా పేరుగాంచిన శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ పతాకంపై దిల్ రాజు, శిరీష్ ఈ చిత్రాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమాకు డీఎస్పీ కేవలం హీరో మాత్రమే కాదు, సంగీత దర్శకుడిగానూ బాధ్యతలు నిర్వర్తిస్తుండటం విశేషం. ఒకవైపు నటన, మరోవైపు తనదైన సంగీతంతో ఆయన ఎలా మ్యాజిక్ చేస్తారోనని ప్రేక్షకులు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఇది పక్కా విలేజ్ బ్యాక్‌డ్రాప్‌లో సాగే యాక్షన్ డ్రామా అని తెలుస్తోంది. 'ఎల్లమ్మ'పై పరిశ్రమలో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఈ చిత్రాన్ని తెలుగుతో పాటు తమిళం, హిందీ, మలయాళం, కన్నడ భాషల్లో పాన్ ఇండియా స్థాయిలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నారు. హీరోయిన్ ఎవరనేది ఇంకా అధికారికంగా ప్రకటించనప్పటికీ, వేణు యెల్దండి సినిమాల్లోని పాత్రలకు ఉండే ప్రాధాన్యత దృష్ట్యా కథానాయిక పాత్ర కూడా బలంగా ఉంటుందని అంచనా వేస్తున్నారు.

# ప్రాంతీయ ముద్రలు తగవు.. 'ఇడుపుకాయితం' వివాదంపై నరేశ్

**తెలంగాణ అంటే తాగడం, ఆంధ్రా అంటే తిండి అనడం తప్పన్న నరేశ్**


**ప్రతి ప్రాంతానికి దాని సంస్కృతి, గొప్పతనం ఉంటాయని వెల్లడి**

**'ఇడుపుకాయితం' టైటిల్ వివాదం తనను బాధించిందన్న నటుడు**

**మాండలికాలు వేరైనా మాట్లాడేది తెలుగు భాషేనని స్పష్టీకరణ**

**సోషల్ మీడియాలోని పోస్టులను పట్టించుకోవద్దని సూచన**

'ఇడుపుకాయితం' సినిమా శీర్షికపై ఇటీవల తలెత్తిన వివాదం నేపథ్యంలో, ప్రాంతీయత ఆధారంగా ముద్రలు వేయడాన్ని ప్రముఖ నటుడు నరేశ్ తప్పుపట్టారు. తెలంగాణ అంటే కేవలం మద్యం, ఆంధ్ర అంటే కేవలం ఆహారం అన్నట్లుగా చిత్రీకరించడం సరికాదని ఆయన పేర్కొన్నారు. ప్రతి ప్రాంతానికి ప్రత్యేకమైన ఆచారాలు, సంస్కృతి ఉంటాయని, ఏ ప్రాంత సంప్రదాయం ఆ ప్రాంతానికి గొప్పదని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడుతూ.. "మాండలికాలు వేర్వేరుగా ఉండవచ్చు కానీ, మనమంతా మాట్లాడేది తెలుగు భాషే. మనం నిర్మించేవి తెలుగు సినిమాలే" అని స్పష్టం చేశారు. సోషల్ మీడియాలో వచ్చే అసంబద్ధ పోస్టులను, విమర్శలను పట్టించుకోవద్దని ప్రజలకు సూచించారు. గతంలో తెలంగాణలో తనకు ఎదురైన ఒక అనుభవాన్ని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. ఒక అంత్యక్రియల కార్యక్రమంలో కొందరు మద్యం తాగడం చూసి తొలుత తాను ఆశ్చర్యపోయానని, అయితే మృతుడితో ఉన్న అనుబంధాన్ని (అతడు శత్రువైనా, మిత్రుడైనా) మనసు విప్పి మాట్లాడటం తనను ఎంతగానో ఆకట్టుకుందని తెలిపారు. 'ఇడుపుకాయితం' అనే పేరు అర్థం కావడం లేదని, సబ్‌టైటిల్స్ కావాలంటూ కొందరు సామాజిక మాధ్యమాల్లో ఎగతాళి చేయడం, దీనిపై తెలంగాణ కవులు, కళాకారులు తీవ్రంగా స్పందించడం వంటి పరిణామాలు తనను ఎంతగానో బాధించాయని నరేశ్ ఆవేదన వ్యక్తం చేశారు.



# త్వరలో పెళ్లి పీటలెక్కనున్న పూజా హెగ్డే?.. పెద్దలు కుదిర్చిన సంబంధమంటూ ప్రచారం!

టాలీవుడ్ స్టార్ హీరోయిన్, బుట్టబొమ్మ పూజా హెగ్డే మరోసారి వార్తల్లో నిలిచారు. అయితే ఈసారి కొత్త సినిమా లేదా గ్లామరస్ ఫోటోషూట్ వల్ల కాదు, తన పెళ్లి వార్తలతో ఆమె సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారారు. త్వరలోనే పూజా హెగ్డే వివాహ బంధంలోకి అడుగుపెట్టబోతున్నారంటూ సినీ వర్గాల్లో జోరుగా ప్రచారం సాగుతోంది. ఆమె కెరీర్ పరంగా కాస్త నెమ్మదించిన ఈ తరుణంలో ఈ వార్తలు రావడం ప్రాధాన్యం సంతరించుకుంది. తాజా సమాచారం ప్రకారం, ఇది ప్రేమ వివాహం కాదని, కుటుంబ సభ్యులు చూసిన సంబంధానికే పూజా గ్రీన్ సిగ్నల్ ఇచ్చారని తెలుస్తోంది. అయితే ఆమె చేసుకోబోయే వరుడు సినీ పరిశ్రమకు చెందిన వారా లేక వ్యాపారవేత్తా అనే దానిపై ఎలాంటి స్పష్టత లేదు. ఈ వార్తలు నెట్టింట వైరల్ అవుతున్నప్పటికీ, పూజా హెగ్డే గానీ, ఆమె ప్రతినిధులు గానీ ఇప్పటివరకు అధికారికంగా స్పందించలేదు. దీంతో ఈ ప్రచారంలో నిజమెంత ఉందనేది తేలాల్సి ఉంది. అభిమానులు మాత్రం అధికారిక ప్రకటన కోసం ఎదురుచూస్తున్నారు. ఒకప్పుడు టాలీవుడ్‌ను ఏలిన పూజా హెగ్డే కెరీర్‌ను పరిశీలిస్తే, 2014లో 'ఒక లైలా కోసం' చిత్రంతో తెలుగు తెరకు పరిచయమైంది. ఆ తర్వాత 'ముకుంద'లో నటించినా, ఆమెకు అసలైన బ్రేక్ ఇచ్చింది మాత్రం అల్లు అర్జున్‌తో చేసిన 'డీజే: దువ్వాడ జగన్నాథం'. ఈ సినిమా తర్వాత ఆమె వెనుదిరిగి చూసుకోలేదు. ఎన్టీఆర్‌తో 'అరవింద సమేత వీర రాఘవ', మహేష్ బాబుతో 'మహర్షి', అల్లు అర్జున్‌తో 'అలా వైకుంఠపురములో' వంటి బ్లాక్‌బస్టర్ హిట్‌లతో అగ్ర కథానాయికగా తన స్థానాన్ని సుస్థిరం చేసుకున్నారు. అగ్రస్థానంలో దూసుకెళ్తున్న సమయంలో ఆమెకు వరుస పరాజయాలు ఎదురయ్యాయి. ప్రభాస్‌తో చేసిన పాన్ ఇండియా చిత్రం 'రాధే శ్యామ్' భారీ అంచనాలతో విడుదలై నిరాశపరిచింది. ఆ తర్వాత 'ఆచార్య', తమిళంలో 'బీస్ట్', హిందీలో నటించిన చిత్రాలు కూడా బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాలను ఇవ్వలేకపోయాయి. దీంతో ఆమె కెరీర్ కొంత నెమ్మదించింది. అయితే, ప్రస్తుతం పూజా హెగ్డే కొత్త ప్రాజెక్ట్‌లతో మళ్లీ బిజీ అవుతున్నారు. మలయాళ స్టార్ దుల్కర్ సల్మాన్‌తో కలిసి 'శ్రీశ్రీ' చిత్రంలో, రాఘవ లారెన్స్ హీరోగా తెరకెక్కుతున్న 'కాంచన 4'లోనూ ఆమె కథానాయికగా ఎంపికయ్యారు. వీటితో పాటు అల్లు అర్జున్ సరసన మరోసారి నటించే అవకాశం ఉన్నట్లు కూడా ఫిల్మ్ నగర్‌లో టాక్ వినిపిస్తోంది.





# జీరో సైజ్ ఉంటేనే హీరోయిన్లా?.. నటి అంజలి ఆనంద్

"రాకీ ఔర్ రాణి కీ ప్రేమ్ కహానీ" చిత్రంతో గుర్తింపు పొందిన నటి అంజలి ఆనంద్.. బాలీవుడ్‌లో నటీమణులు ఎదుర్కొంటున్న బాడీ షేమింగ్, ఆన్‌లైన్ ట్రోలింగ్‌పై గళమెత్తారు. ప్రస్తుతం ధమాల్ 4 సినిమాలో నటించిన ఆమె చిత్ర పరిశ్రమలో అందానికి ఉన్న సంకుచిత నిర్వచనాలను సూటిగా నిలదీశారు. "బాలీవుడ్‌లో గ్లామర్ అంటే కేవలం 'జీరో సైజ్' శరీరాకృతి మాత్రమేనా? ఒక నటి ప్రతిభను కాకుండా, ఆమె రూపాన్ని బట్టి భవిష్యత్తును ఎందుకు అంచనా వేస్తున్నారు?" అని అంజలి ప్రశ్నించారు. తన నటన, కష్టం కంటే తన బరువు గురించే సమాజం ఎక్కువగా చర్చించడం బాధాకరమని, అయితే అటువంటి విమర్శలకు కుంగిపోకుండా తన ప్రతిభతోనే సమాధానం చెబుతానని ఆమె స్పష్టం చేశారు. తన పోరాటం కేవలం తన కోసమే కాదని, ఇటువంటి వివక్షను ఎదుర్కొంటున్న ప్రతి అమ్మాయి కోసమని ఆమె పేర్కొన్నారు. సంప్రదాయ కథానాయికల రూపానికి భిన్నంగా ఉండే నటీమణులకు బాలీవుడ్‌లో ఇప్పటికీ ఆశించిన స్థాయిలో పాత్రలు లభించడం లేదని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. నటీమణుల బాహ్య రూపాన్ని కాకుండా, వారి నైపుణ్యాలను, భావోద్వేగాలను వాడుకునేలా రచయితలు, దర్శకులు పాత్రలను సృష్టించాలని ఆమె కోరారు. 'ధమాల్ 4'లో తన పాత్ర, తాను వ్యక్తిగతంగా వ్యతిరేకించే అంశానికి సంబంధించి ఉండటంతో, దానిని అంగీకరించే ముందు కొంత మానసిక సంఘర్షణకు లోనైనట్లు ఆమె వెల్లడించారు. 'ధమాల్ 4' ట్రైలర్ విడుదలైన తర్వాత ఎదురైన ట్రోలింగ్‌ను తాము ముందే ఊహించామని, దానికి మానసికంగా సిద్ధమయ్యామని అంజలి తెలిపారు. ట్రోల్స్‌ను పట్టించుకోకపోవడమే సరైన సమాధానమని, విమర్శలను ఎదుర్కోవడానికి తనకు ఎవరి ఓదార్పు అవసరం లేదని ఆమె ధీమా వ్యక్తం చేశారు. బరువు, రంగు, దుస్తుల ఆధారంగా మనుషులను అంచనా వేయడం అనేది సమాజంలో వేళ్లూనుకున్న ఒక రుగ్మత అని, ఒక కళాకారిణిగా తన వృత్తి ద్వారా ఈ ఆలోచనా విధానంలో మార్పు తీసుకురావడానికి నిరంతరం ప్రయత్నిస్తూనే ఉంటానని ఆమె స్పష్టం చేశారు.

Edited, Published and owned by **PAMANAGUDNDLA NAVEEN KUMAR,** Printed at **SRI printers** at H.No. 1-47/1, Ganesh Nagar, Dandampelly, Nalgonda , Telangana State : Editor, **PAMANAGUDNDLA NAVEEN KUMAR** : **RNI No. TELTEL 2023/88559**, Cell : **9553276552,**